
# మొక్కుబడి

సంఘమిత్ర

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల
పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ



"దొరికిందా?" - నూకరాజు అసహనంగా అడిగాడు రాజులమ్మని. ఇప్పటికి అలా అడగడం పదోసారి.

రాజులమ్మ వెతుకుతూన్నభోషాణం లోంచి మొహం బయటకు పెట్టి, "లేదు" - నీర్సంగా చెప్పి, మరలా తన పనిలో తాను నిమగ్నమైంది.

అప్పటికే ఇంట్లో అన్నీ వెతికేసింది. అమ్మగారింటి నుండి తెచ్చుకున్న ఇనుపపెట్టెలు, రేకు డబ్బాలు, బట్టలమూట, ఆయనగారు కొన్న క్రర బీరువా, అటకపైన పేర్చుకున్న పాత్ర సామానూ, విడ వకుండా వెతికింది. వెతికినదే పది మార్లు వెదికింది. అయినా ఫలితం శూన్యం. ఆఖరి ప్రయత్నంగా ఆర్నెల్ల క్రితం తాళం వేసేసిన మూలనున్న భోషాణాన్ని వెతుకుతోంది.

"ఎవరి చేతిలోనో పడిపోయే ఉంటుంది" నూకరాజు అప్పటికే ఓ నిర్ణయానికొచ్చి, ఆ మాట బయటకనేశాడు. మాటయితే అనేశాడు గాని, తర్వాత ఒక్కసారి నీరసం ముంచుకొచ్చింది నూకరాజుకు. రాదూ! మరి? ఒకటా రెండా? ఆరుపేటల గొలుసు. పచ్చగా మెరిసిపోతూ, రాజులమ్మ మెడను ఎప్పుడూ విడ వకుండా ఉండేది, పరమ శివుడి గరళకంఠాన్ని నాగరాజు విడువనట్లు.

నూకరాజు అసహనంగా కుర్చీమీంచి లేచి పచార్లు మొదలెట్టాడు. ఇటూ, అటూ పది మార్లు తిరిగేసరికి కాలు లాగిందేమో, మళ్ళీ కుర్చీమీద కూర్చున్నాడు. భోషాణం పెట్టె మూత వేసిన చప్పుడైంది.

"దొరికిందా?" నూకరాజు పదకొండవమార డిగాడు.

లోపల్నుండి సమాధానం లేదు. రాజులమ్మ పెట్టె ప్రక్కనే చతికిలబడి కళ్ళు వత్తుకుం టోంది. నాలుగేండ్ల బాబు పెట్టె లోంచి బయటకు తీసిన పాతవస్తువుల్లోఆడుకునేందుకు ఏం పనికొస్తాయా అని పరిశీలనగా చూస్తు న్నాడు.


నూకరాజు లోపలి కొచ్చాడు. పరిస్థితి అర్థమ యిందతడికి. రాజులమ్మ ఏడుస్తూ కూస్తున్న దంటే వస్తువు దొరక లేదన్నమాట.

ఉండి ఉండి ఉయ్యాల్లో నెలరోజుల పాప గుక్క తిప్పకోకుండా ఏడుపు ప్రారంభిం చింది. ఏడుస్తున్న పాపను పట్టించుకునే వారె వ్వరూ లేరు.

నూకరాజు ఇంటి నలు మూలలా దృష్టి సారించాడు. ఇంక వెతకటానికేమి మిగల్లేదు. "అయితే ఇది ఖచ్చితంగా వాడిపనే". పాపని చూడడానికంటూ వచ్చి వెళ్ళిన బంధువులలో ఒకరి మీద నూకరాజుకు కలిగిన అనుమానం ధృవ పడింది.

నూకరాజు ఆలోచించసాగాడు, ఏం చేస్తే పోయిన వస్తువు తిరిగి తనస్వంతంఅవుతుందని.

ఉన్నట్లుండి నూకరాజు దృష్టి గదిలో ఓ



మూల గోడ మీద నిలిచి పోయింది. అక్కడ దేవుళ్ళ పటాలున్నాయి. అన్నింటికీ మధ్యగా నూకాలమ్మ పటం పెద్దగా కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. నూకాలమ్మ నూకరాజు కుటుంబానికి ఆరాధ్య దైవం. నూకరాజుకు అప్పుడు జ్ఞాపకం వచ్చింది.

''రాజూ'' — అని పిలిచాడు నూకరాజు.

రాజులమ్మ భర్తకేసి దృష్టి సారించింది.

''లే! ముందు స్నానం చేసి నూకాలమ్మకు ముడుపు కట్టు. పోయిన వస్తువు దొరికితే వచ్చేవారం పండగలకి చీర చూపెట్టి, కోడి కోస్తానని మొక్కు.''


రాజులమ్మ భర్త ఆజ్ఞను శిరసావహిస్తూ, నూకాలమ్మకు నమస్కరించి, స్నానం చేసి ముడుపు కడదామని బాత్ రూమ్‌కు బయలు దేరింది:

నూకరాజు అంతవరకూ నూకాలమ్మ ను తలవనందుకు విసుక్కున్నాడు. తన తప్పుకు లెంపలేసుకున్నాడు. అవును మరి, తమకొచ్చిన ఎన్నో కష్టాల్ని గట్టెక్కించింది నూకాలమ్మ. ఆపదలో తలచుకోవడమే తరవాయిగా కుటుంబాన్ని ఇన్నాళ్ళుగా ఆదుకుంటున్న నూకలమ్మని ఇంత వరకూ తలవనందుకు నూకరాజు చాలా విచారించాడు.

''ఏమండీ!'' బాత్ రూమ్ నుండి రాజులమ్మ కేక. జరక్కూడనిదేదో జరిగి నట్లయింది నూకరాజుకు. మళ్ళీ జారిపడిందేమోనని ఆత్రుతగా పరిగెత్తాడు నూకరాజు బాత్‌రూమ్ వైపు. ఒక్కసారి తలుపు తీసుకుని వచ్చిన రాజులమ్మ భర్తను అమాంతం ఢీ కొట్టినంత పని చేసింది.

రాజులమ్మ తెగ ఆయాస పడుతూ చెప్పింది ''దొరికిందండీ. నేనే సోప్ కేస్‌లో ఉంచేశాను స్నానం చేస్తున్నప్పుడు, ఇదిగో నండి'' అని చూపిస్తూ, తను చేసిన పని తనకే జ్ఞాపకం వచ్చినందుకు బోల్డంత ఆనందపడ్తూ.

''నీ మొహం, పిచ్చిముండా, ఇదంతా ఆ తల్లి చలవ'' — తన్మయత్వంతో నూకాలమ్మను తలుచుకుంటూ, ఆప్యాయంగా గొలుసును చేత్తో తాకాడు నూకరాజు. రాజులమ్మకు కూడా ఆమాట నిజమనిపించింది. అవును మరి, ఆరుగంటల సేపు నానా హైరాన పడి వెదికినా జ్ఞాపకం రానిది, నూకాలమ్మను తలచుకోగానే దొరకడ మేమిటి? రాజులమ్మ గబగబా స్నానం చేసి తడి బట్టల్తోనే నూకాలమ్మకు



✱ Ramesh ✱

ముడుపు తీసింది.

* * *

బస్సులో - కిక్కిరిసి ఉన్న జనం ఒక్కుమ్మడిగా మాట్లాడేస్తున్నారు. అందరి మాటా కలసి ఒకే మాట. అది నూకాలమ్మ మహత్యం గురించి. ఎవరెవరికి ఎలాంటి ఫలితాల్నిచ్చిందో చెప్పుకుంటున్నారు. అయితే అందరూ ఒకేసారి మాట్లాడ్డం వలన అన్నీ కలసే అర్థం కాని ఒకే మాటగా వినిపిస్తోంది. అలా ఒకే మాట మాట్లాడుతున్న జనాన్ని పెద్ద పెద్ద గంతలు మాత్రం ఉండి, ఒడిదుడుకులు లేని ఒకేబాట మీద బస్సు మోసుకు పోతోంది. అలా సాగిన ప్రయాణంలోగంట తర్వాత గమ్యస్థానాన్ని చేరామనే విషయాన్ని కూడా జనం మరిచిపోయారు. భక్తి తన్మయత్వం అటు వంటిది మరి! బస్సు ఆగాక, ఎవరు ముందు దిగాలో నిర్ణయించుకోలేక అందరూ ఒకేమారు దిగటానికి ప్రయత్నం చేయడం వలన, అలా దిగలేక పోవడంవలన కొంచెం త్రొక్కిసలాట జరిగింది.

నూకరాజు కుటుంబ సమేతంగా అదే బస్‌లో ఉన్నాడు. మగవాడు కావడం మూలాన నూకరాజుకిటికీనుండి దూకగలిగాడు. కాని, రాజులమ్మ కోసం చివరివరకూ నిరీక్షించడం నూకరాజుకు తప్పలేదు.

ఒక చేత్తో కోడి, ఒక చంకలో చంటిపాపతో రాజులమ్మ ముందు నడుస్తోంది. ఒక చేత్తోబాబు గాడి చేయి పుచ్చుకుని, ఒక చేత్తో చీర ఉన్న సంచీ పట్టుకొని నూక రాజు రాజులమ్మను అనుసరించాడు. పండగలకు నూకాలమ్మ మొక్కులు తీర్చుకోవడానికి జనం ఎంత దండిగా వస్తారో రాజులమ్మకు అప్పుడర్థమైంది. రాజులమ్మ నూకాలమ్మ గుడికి అడపా తడపా వచ్చినా, పండ గలకంటూ రావడం ఇదే తొలి సారి. క్యూలో నిల్చొని కాళ్ళు పీకాయి రాజులమ్మకు. చంటిపాప పాలకోసం సొమ్మసిల్లి పోయింది. బాబు గాడు జనంలో ఓ మారు తప్పిపోయి, ఎలాగైతేనేం, మళ్ళీ దొరికాడు. ఏమి జనం? ఏమి జనం? ప్రమాదవశాత్తు నిప్పంటుకున్న సర్కస్ గుడారం నుండి ఉన్న ఒకే మార్గం ద్వారా తప్పించుకునేందుకు బయట పడుతున్నట్లు జనం నూకాలమ్మ గుడి ముంగిట గుమిగూడిపోయారు.

ఎలా అయితేనేం? నూకాలమ్మ దర్శనం అయిపోయింది. చీర చూపించారు. పోయి దొరికిన గొలుసు నూకాలమ్మకి తాకించారు. ముడుపు చెల్లించారు. మనసారా దణ్ణం పెట్టుకుందికి మాత్రం అవకాశం లేకపోయింది. గుడి ముందు కోడి కొయ్యనివ్వరు గనుక బయటపడి, తీరుబడిగా ఓ చెట్టు నీడను ఎంచుకున్నారు నూకరాజు దంపతులు. అక్కడ మళ్ళీ పూజ చేసి కోడిని కోసారు. తెగిపడ్డ కోడి తల సగం మూసిన కళ్ళతో ''ఇచ్చట జీవహింస చేయరాదు.'' అనే బోర్డుకేసి దీనంగా చూసింది.

వేళమించితే తిరుగుప్రయాణం కష్టమవుతుందని నూక రాజు త్వరగా రాజులమ్మను బయలుదేరించాడు. రాజులమ్మ సంచి సర్ది పాపను చంకనేసుకుని మెడలో బంగారపు గొలుసును సర్దుకుని తిరుగు ప్రయాణం కట్టింది. చంటిపిల్లతో ఉన్న రాజులమ్మను కనికరించి బస్సువెక్కేందుకు చోటిచ్చారు. బస్సుకిక్కిరిసిన జనంతో బయలు దేరింది. క్షేమంగా ప్రయాణం జరిపించినందుకు నూకరాజు మరో మారు నూకాలమ్మకు మనసారా నమస్కరించాడు.

* * *

బస్సు దిగేసరికి సంజ చీకట్లు ముసురుకొంటున్నాయి. ఊర్లో దీపాలుఒక్కటీ, ఒక్కటీ వెలుగుతున్నాయి. అతికష్టం మీద జనాన్ని నెట్టుకొని, బస్సుదిగిన రాజులమ్మ చంటిపాపను సర్దుకుని, చలి గాలి పట్టకుండా పమిటకొంగు కప్పింది. అలా కప్పుతున్నప్పుడు గమనించింది మెడ వెలితిగా ఉందని–తన మెడలో వున్న ఆరు పేటల బంగారు గొలుసు మాయమైందని!